
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com



నేటి నుంచి సోయా పంట కొనుగోళ్లు

నిర్మల్ చైన్‌గేట్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):నిర్మల్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో బుధవారం నుండి సోయా కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి మంగళవారం తెలిపారు. రైతులు పండించిన సోయా పంటను తొందరగా కొనుగోలు చేసేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు తీసుకువెళ్లారని తెలిపారు. సోయాబీన్ పంటకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 5,328 చొప్పున మద్దతు ధరను ప్రకటించిందని అన్నారు.

వైద్య వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

» జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్,హాజరైన అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైద్య వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య వ్యర్థాల నిర్వహణపై (బయో మెడికల్ వేస్టేజీ మేనేజ్మెంట్) అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, పశు ఆసుపత్రులు, వైద్య శిబిరాల్లో నుంచి నిరంతరం వైద్య వ్యర్థాలు సేకరించి, ప్రభుత్వం నిర్ధారించిన శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించి, నిర్వీర్యం చేయాలన్నారు. ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనల ప్రకారం ప్రత్యేకంగా వైద్య వ్యర్థాలు సేకరించాలన్నారు. వైద్య వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలకు వ్యతిరేకంగా బయట పారివేయరాదన్నారు. ఇలా చేస్తే పర్యావరణానికి ఎంతో ప్రమాదం కలుగుతుందని చెప్పారు. ఇందుకు గాను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అన్ని ఆసుపత్రులు తప్పనిసరిగా కాలుష్య నియంత్రణ అనుమతులు కలిగి ఉండాలని వివరించారు.అనుమ తులు లేని రెన్యువల్ చేసుకోని ఆసుపత్రులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైద్య, మున్సిపల్ శాఖల అధికా రులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా నేతలు



మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిని కలిసిన జిల్లా కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌రూరల్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు హర్షవర్ధన్ సత్పాల్ సోమవారం రాత్రి నాందేడ్ ప్రయాణంలో భాగంగా నిర్మల్‌లో బసచేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

» అలా మంజూరు... ఇలా తరలింపు
» అగ్రిసెజ్, ఇథనాల్, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీల రద్దు
» రాజకీయాల చక్రబంధంలో ఇండస్ట్రియల్ జోన్‌లు
» తరలిపోతున్న పరిశ్రమలతో యువకులకు ఉపాధి కరువు
» జిల్లా రైతులకు తీరని శాపం

జిల్లాకు పరిశ్రమల షాక్



నిర్మల్ మండలం పాక్‌పట్ల గ్రామ శివారులో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మించ తలపెట్టిన ప్రదేశం ఇదే..

రాజకీయాల కారణంగానే...

నిర్మల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాజకీయ సాంకేతిక కారణాల వల్ల ఏళ్ల నుంచి ఏ ఒక్క కొత్త పరిశ్రమ కూడా ఏర్పాటు కాకపోతుండడం ఉపాధి రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జిల్లాలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడం చర్చనీయాంశమవుతోంది. మూడు జాతీయ రహదారులు అలాగే రోడ్లు, రైలు, రవాణా సౌకర్యాలే కాకుండా ప్రధాన వాణిజ్య కేంద్రాలు సమీపంలో ఉండడంతో జిల్లాలో వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటు చేయాలని మొదట్లో తలపెట్టారు. దీనికి సంబంధించి శాఖలు పరిశ్రమల ఏర్పాటు కోసం అన్ని రకాల అనుమతులు సైతం తీసుకున్నారు. అయితే ఈ ప్రాంతాల్లో సాంకేతిక, క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశ్రమల ఏర్పాటుకు భిన్నంగా ఉన్న కారణంగా వాటి నిర్మాణాలను వాయిదా వేస్తున్నారు. గత ఏడాది కాలంలో జిల్లాలో దాదాపు 50కి పైగా పరిశ్రమలు ప్రైవేటు రంగంలోని భారీ సంస్థలు ప్రారంభించాల్సి ఉంది. అయితే రక రకాల ఒడిదొడుకుల కారణంగా ఆ పరిశ్రమలను ఏర్పాటు చేసే సంగతి పక్కన పెడితే ఏకంగా అవి ఇతర జిల్లాలకు తరలిపోవడం అందరిని ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా పరిశ్రమలు ఏర్పాటు కాకపోతుండడంతో ఇక్కడి యువకులు ఉపాధి అవకాశాలను పెద్ద ఎత్తున కోల్పోతున్నారు. వారికి శ్రమకు తగ్గ వేతనం గానీ, ఉపాధిపై భరోసా గానీ దక్కడం లేదు. దీంతో పరిశ్రమల ఏర్పాటుకు చాలా మంది ముందుకు రాకపోతుండడం గమనార్హం.

> జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం, స్థానిక యువకులందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం పరిశ్రమలను ఏర్పాటు చేసే ప్రాంతంలోని స్థానికులను కొన్ని రాజకీయ పార్టీలు రెచ్చగొట్టి వాటి ఏర్పాటును అడ్డుకున్నాయి.

బాసర నుంచి తరలిపోయిన సెజ్

బాసరలో సెజ్‌ను ఏర్పాటు చేసేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్పెషల్ ఎకనమిక్ జోన్ కింద ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని తలపెట్టింది. దీని కోసం భూ సేకరణ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అయితే ఇక్కడి నాయకుల లోపంతో ఆ పరిశ్రమ నేరుగా బెల్లంపెల్లికి తరలిపోవడం చర్చకు తావిస్తోంది. ఇక్కడి పరిశ్రమలు ఏర్పాటు చేసే ప్రాంతంలోని భూమి నాణ్యత లేదని అలాగే వరదలు వచ్చే ప్రమాదం ఉందంటూ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించారు. దీంతో అధికారులు బెల్లంపెల్లికి తరలించారు.

రైతుల ఆందోళనలతో ఇథనాల్ వెనక్కి

జిల్లాలోని దిలావర్‌పూర్ మండలంలోని గుండంపెల్లి సమీపంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రాజకీయాలే అడ్డుకున్నాయని అంటున్నారు. ఇరు పార్టీల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా ఈ పరిశ్రమ ఏర్పాటుకు ఆటంకాలు కలిగాయి. పరిశ్రమ ఏర్పాటు కోసం ఉంచిన సామగ్రిని రైతులు ధ్వంసం చేసి రాస్తారోకోను నిర్వహించారు. పరిశ్రమ కారణంగా తమ పచ్చని పొలాలన్ని కాలుష్య కోరల్లోకి చిక్కుకుంటాయని, పరిశ్రమను దూర ప్రాంతానికి తరలించాలంటూ ఆ రైతులు డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు దిగి వచ్చిన సర్కారు ఏకంగా ఈ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసింది.

తరలిపోయిన ఆయిల్‌పామ్ పరిశ్రమ..

జిల్లాలో ఏర్పాటు చేయతలపెట్టిన ఆయిల్‌పామ్ పరిశ్రమ కూడా నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని ఎడపెల్లి మండల కేంద్రానికి తరలిపోనున్నట్లు స్పష్టమవుతోంది. జిల్లాలోని పాక్‌పట్ల గ్రామంలో ఈ పరిశ్రమకు ఏర్పా ట్లు చేశారు. రైతులను ప్రోత్సాహించేందు కోసం సబ్సిడీలతో పాటు మొక్కలకు సంబంధించి బీరవెల్లి గ్రామం వద్ద పెద్దఎత్తున నర్సరీని కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఈ పరిశ్రమను ఏర్పాటు చేసే స్థలం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద ప్రభావిత ప్రాంతంలోకి వస్తుందని ఇరిగేషన్ శాఖ ఎన్‌ఓసీని జారీ చేయలేదు. ఎన్‌ఓసీ జారీ కానీ కారణంగా పరిశ్రమ ఏర్పాటును సంబంధిత యాజమాన్యం నిలిపివేసింది. దీంతో ఈ పరిశ్రమను నిజామాబాద్ జిల్లాకు తరలించబోతున్నారు.

ఇథనాల్ పరిశ్రమల నిర్మాణంతో కాలుష్యం..

: కటకం రాజారెడ్డి, రైతు, దిలావర్‌పూర్



మూడు పంటలు పండే పంట భూముల్లో ఇథనాల్ పరిశ్రమ నిర్మించడం మంచిది కాదు. పరిశ్రమ నిర్మించి రైతుల కడుపు మీద కొట్టాలని ప్రయత్నించడం మంచిది కాదు. పరిశ్రమ నిర్మాణంతో భూగర్భ జలాలతో పాటు వాయు కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉన్నందునే అందరూ వ్యతిరేకిస్తున్నారు.

పామ్‌ఆయిల్ పరిశ్రమ తరలిస్తే ఉద్యమం..

: ఎలాల చిన్నారెడ్డి, రైతు, గుండంపల్లి



సోన్ మండలం పాక్‌పట్ల శివారులో నిర్మించ తలపెట్టిన పామ్‌ఆయిల్ పరిశ్రమను నిజామాబాద్ జిల్లాకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పరిశ్రమ నిర్మిస్తున్నారనే ఉద్దేశంతోనే పామ్ ఆయిల్ సాగుచేశాం. పామ్‌ఆయిల్ పరిశ్రమ తరలిస్తే ఉద్యమిస్తాం. అధికారులు పునరాలోచించాలి. పరిశ్రమను ఇక్కడే నిర్మించాలి.

పామ్‌ఆయిల్ ఫ్యాక్టరీ ఇక్కడే ఏర్పాటు చేస్తాం..

: బీవీ రమణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

జిల్లాలో నిర్మించ తలపెట్టిన పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ పక్కనే ఉన్న నిజామాబాద్ జిల్లాకు తరలిపోనున్నదని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు. అయితే సోన్ మండలం పాక్‌పట్ల వద్ద మొదట నిర్మించాలనుకున్న ప్రాంతంలో కాకుండా మరోచోట ఫ్యాక్టరీని నిర్మించేందుకు చర్యలు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పది వేలకు పైగా ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతుండగా, దాదాపు 1700 ఎకరాల్లో పంట దిగుబడులు కూడా వస్తున్నాయి.

ఆర్జీయూకేటీలో మ్యాడ్ సైంటిస్టు ఏఐ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

బాసర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) బాసర, హైదరాబాద్‌కు చెందిన మ్యాడ్ సైంటిస్టు ఏఐ సంస్థతో మంగళవారం అంతర్జాలంలో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో విద్యార్థుల్లో కృత్రిమ మేధస్సు నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ముఖ్యఅంశాలు..

మ్యాడ్ సైంటిస్టు సంస్థ ఇంజనీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్ష. ఏఐ విద్య వనరులను అందిస్తుంది. పరిశోధన, స్టార్టప్ అభివృద్ధి ఏఐ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశ్యం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫేసర్ ఏ. గోవర్ధన్, డీన్ మహేశ్, మ్యాడ్ సైంటిస్టు నిపుణులు సిలివేరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి శాన్విత చికిత్సకు ప్రవాసుల చేయూత



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న మిత్ర బృందం

నర్సాపూర్(జి),అక్టోబరు28(ఆంధ్రజ్యోత):మండల కేంద్రానికి చెందినదివ్యశ్రీ-ధర్మరాజు దంపతుల కుమార్తె శాన్విత(4) కేజీబీవీ పాఠశాలలో ప్రమాదవశాత్తు వేడి పప్పుపాత్రలో పడి తీవ్ర గాయాలపాలైంది. మెరుగైన చికిత్స కోసం చిన్నారిని హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రికి తరలించారు. చిన్నారిని ఆదుకోండి అంటూ ఆంధ్రజ్యోతి దినపత్రిలో వచ్చిన శీర్షికకు స్పందించిన తెలంగాణ ఇజ్రాయిల్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు (ప్రవాసులు) తమ మానవత్వాన్ని చాటుకున్నారు. వారు తమవంతు సహాయంగా రూ. 26,000 ఆర్థిక సహాయాన్ని చిన్నారి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. కష్టకాలంలో సంఘం అందించిన ఈ దాతృత్వంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నవీన్



నవీన్

నిర్మల్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25, 26, 27 తేదీలలో నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ప్రథమ మహాసభలలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జిల్లాకు చెందిన జిల్లా కార్యదర్శి నమత్కార్ నవీన్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తే సంఘ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ధాన్యం, పత్తి కొనుగోలును సమర్థవంతంగా నిర్వహించాలి

» రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,అదనపు కలెక్టర్

నిర్మల్‌రూరల్,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం. ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం హైద రాబాద్ నుంచి వ్యవసాయ,మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి జిల్లా కలెక్టర్లు,అదనపుకలెక్టర్లు, పౌర సరఫరాలు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, రవాణాశాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తుఫాను ప్రభావంతో అకాల వర్షాలు కురిసిన నేపథ్యంలో వరిధాన్యం,పత్తి కొ నుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయంలేకుండా చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పా లిన్ కవర్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... తుఫాను తీవ్రత దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను తీవ్రత తగ్గే వరకు హార్వెస్టింగ్ నిలిపి వేయాలని, కోతపడ్డ ధాన్యం తడవకుండా జా గ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు సంబం ధిత శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా జరుగుతుందని, కౌలు రైతులు కూడా వ్యవ సాయ విస్తరణ అధికారుల సహాయంతో తమవివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరిధాన్యం, పత్తి తేమ శాతం నిబంధనలకు అను గుణంగా ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలా గే సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తంగా ఉండి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరిధాన్యం, సోయాబీన్, కందులు, పెసళ్లు వంటి పంటల అక్రమ రవా ణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేడ్ 'ఏ' రకం ధాన్యానికి క్వింటాల్‌కు 2,389,సాధారణ రకానికి 2,369 మద్దతు ధర నిర్ణయించబడిందని తెలిపారు. అదనంగా సన్న వడ్లకు క్వింటాల్‌కు 500ల ప్రోత్సాహక రుసుము అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ...ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస మౌలిక వసతులు కల్పించి, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండల తహసీల్దార్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చిస్తూ, తుఫాను ప్రభావం కారణంగా రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతా ల్లో ఆరబెట్టిన పంట తడవకుండా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. తుఫాను ప్రభావం గురించి రైతులకు తెలియజేసి అప్రమత్తంగా చేయాలని, అవసరమైతే వచ్చే మూడు రోజుల పాటు వరి కోతలు నిలిపి వేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లు లకు ధాన్యం తరలింపు వెంటనే జరిగేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, అధికారులు విజయలక్ష్మి,రాజేందర్,సుధాకర్, నర్సయ్య, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో

భైంసారూరల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్గుల్ గ్రామ పంచాయతీని మంగళవారం డీఎల్పీవో లక్ష్మణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన గ్రామ పంచాయతీ పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామంలో పారిశుద్ధ్య పనులు, వాటర్ టాక్యాంక్ క్లీనింగ్, ఇందిరమ్మ ఇళ్లు, రహదారి వెంట ఉన్న మురికి కాలువలు క్లీన్ మొదలైన అంశాల గురించి నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. గ్రామంలో ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం కొరకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈయన వెంట ఎంపీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి గంగన్న, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థిని ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రితిక

భైంసా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఆల్ఫోర్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని ఒకరు దక్షిణ రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలకు ఎంపికైనట్లుగా ఖేల్ ఇండియా జిల్లా శిక్షకుడు శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయిఖేలో ఇండియా మహిళల ఉషూ సిటీ లీగ్- 2025 పోటీలలో పాల్గొన్న పాఠశాల 7వ తరగతి విద్యార్థినీ జి.రితిక సబ్ జూనియర్ నాన్ క్వాన్ విభాగంలో ప్రతిభను చాటుకొని దక్షిణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లుగా వివరించారు.

మస్కాపూర్ బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

» విద్యార్థుల వికృత చేష్టల నేపథ్యంలో వార్డెపై వేటు

ఖానాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల బీసీ వసతి గృహంలో వార్డెన్ ప్రకాష్‌పై మంగళవారం జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా వివరాలు వెల్లడించారు. గత కొద్ది రోజుల క్రితం హాస్టల్‌లోని ఓ ఆరో తరగతి విద్యార్థినిపై మరో ఇద్దరు తొమ్మిదో తరగతి విద్యార్థులు చేసిన వికృత చేష్టల నేపథ్యంలో వార్డెన్‌ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారన్నారు. మస్కాపూర్ బీసీ బాలుర వసతి గృహంలో జరిగిన ఘటనపై గత శనివారం వార్తలు వెలుగులోకి వచ్చిన విషయం విదితమేనన్నారు. ఈ నేపథ్యంలో జరిగిన ఘటనపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి ఆదేశాలతో గత శనివారం తనతో పాటు మరో ఇద్దరు అధికారులతో కూడిన విచారణ బృందం ఆధ్వర్యంలో హాస్టల్‌లో, పాఠశాలలో విచారణ నిర్వహించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ విచారణ తాలూకు నివేదికను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు అందజేయడంతో వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మరింత లోతైన విచారణ కొనసాగుతోందన్నారు.

శ్రీగిరి క్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు



కావడి సేవలో పాల్గొన్న భక్తులు



అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

నిర్మల్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామివారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కావడి సేవ, రథసేవ, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించినట్లు శ్రీ గురు మాత రాజరా జేశ్వరి దేవి అర్చారిరాజవ్వ తెలిపారు. ఈసందర్భంగా చెనిగారపు చిన్నయ్య గురుస్వామి ఆలయ విశిష్టత గురించి భక్తులకు తెలిపారు. భక్తులకు చించోలి(బి) వాస్తవ్యులు సుదర్శన్, లక్ష్మీ అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో వీర నారాయణస్వామి,గురుస్వామి,చింతపండుపోశెట్టి, అయిట్ల నరేష్, గణేష్,అర్చారి రామయ్య పాల్గొన్నారు.

రైతులకు వరి రకంపై అవగాహన

ముథోల్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మండ లంలోని ఎడ్‌బిడ్ శివారులో గలకాశీరాంఅనే రైతుపొలంలో మంగళవారం సీడ్స్ ఇండియా కంపె నీ ఆధ్వర్యంలో సంపంగి- 15048 వరి రకంపై క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొని రైతు లకు సంపంగి-15048 రకానికి సంబంధిం చిన ప్రత్యేకతలు, దిగుబడి లక్షణాలు, వ్యాధి నిరోధక, తక్కువ కాలంలో పంట పండించే సామర్థ్యం వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ప్రతినిధులు ప్రవీణ్ రావు, శంకర్ పటేల్‌లు మాట్లా డుతూ... ఈ రకం రైతులకు అధిక దిగుబడితో పాటు మంచి ధాన్య నాణ్యతను ఇస్తుందని తెలి పారు. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ ఉత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు.ఈకార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



రైతులకు సంపంగి - 15048 రకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కంది శ్రీనివాస్‌రెడ్డిని ఫోన్‌లో పరామర్శిస్తున్న మంత్రి వెంకటస్వామి

కంది శ్రీనివాస్‌రెడ్డికి పరామర్శ

ఆదిలాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డిని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ఫోన్‌లో పరామర్శించారు. గత ఆదివారం ఆయన బావమరిది అఖిల్‌రెడ్డి గుండె పోటుతో మృతి చెందడంతో కంది శ్రీనివాస్‌రెడ్డికి మంత్రి ఫోన్ చేసి మాట్లాడి ధైర్యం చెప్పారు. అఖిల్ మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబానికి తీరని లోటని చిన్న వయసులో మృతి చెందడం చాలా బాదాకరమన్నారు.

మాజీ మంత్రి హరీశ్ రావు తండ్రి మృతి పట్ల సంతాపం

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్ రావు తండ్రి సత్యనారాయణ మరణం పట్ల మాజీ మంత్రి జోగు రామన్న తీవ్ర సంతాపం ప్రకటించారు. హరీశ్ రావుతోపాటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభుతి తెలిపారు. ఇటువంటి కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన తండ్రి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

అంతర్ రాష్ట్ర సరిహద్దు మీదుగా.. పశువుల అక్రమ రవాణా

- సోనాల మండలం మీదుగా కొనసాగుతున్న పశువులు రవాణా
- 44వ జాతీయ రహదారిపై కంటైనర్‌లలో తరలిస్తున్న వైనం
- దృష్టి సారిస్తాం : బోథ్ సీఐ



అక్రమంగా పశువులం తరలిస్తు పట్టుబడిన కంటైనర్లు (ఫైల్)

బోథ్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలల మీదుగా ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారిపై నుంచి పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు ఈ అక్రమ రవాణా సాగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే, గత నెల 16న ఒక కంటైనర్, ఈ నెల 16న మరో కంటైనర్ పట్టుబడింది. దీంతో అక్రమ పశువుల రవాణా జోరుగా సాగుతుందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతోంది.

గుట్టుచప్పుడుకాకుండా..

సోనాల మండలం మీదుగా 44వ జాతీయ రహదారిపై నుంచి నేరుగా కంటైనర్లలో పశువుల రవాణ కొనసాగుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా ఈ అక్రమ పశువుల రవాణా కొనసాగుతుందని పలువురు పేర్కొంటున్నారు. పోలీసులకు పక్కా సమాచారం వస్తేనే పశువుల తరలిస్తూ వాహనాలు పట్టుబడుతున్నాయి. లేకుంటే యథేచ్ఛగా పశువులు కోళభరాలకు తరలిపోతున్నాయని అంటున్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల పైన ప్రతి వాహనాన్ని పకడ్బందీగా తనిఖీ చేస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్టపడే అస్కారం ఉందని అంటున్నారు. ముఖ్యంగా కంటైనర్లలో రవాణా జోరుగా సాగుతుందని అంటున్నారు. గత యేడాది సైతం నేరడిగొండ మండలంలో అక్రమ పశువుల రవాణా చేస్తూ కంటైనర్లు పట్టుబడ్డాయి. కోట్ల రూపాయల వ్యాపారం పోలీసుల కన్నుగప్పి జరుగుతుందని అంటున్నారు.

అక్రమ రవాణా పై దృష్టి సారిస్తాం : గురుస్వామి, సీఐ, బోథ్

పశువుల అక్రమ రవాణా పై దృష్టి సారిస్తామని బోథ్ సీఐ గురుస్వామి పేర్కొన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పశువుల అక్రమ రవాణాపై సమాచారం ఇస్తే వారి పేరు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని ఆయన సూచించారు.

పరిహారం.. ఇంకెప్పుడు?

(5వ పేజీ తరువాయి...)

ఎకరాన రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టినా.. పంటలు కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో కోట్ల రూపాయల పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించినా.. ఇప్పటి వరకు నయా పైసా రైతులకు అందలేదు.

ఎకరాన రూ.25 వేల డిమాండ్

పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాన రూ.25 వేల నష్ట పరిహారాన్ని చెల్లించాలని రైతు సంఘాలు, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గతేడు భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించింది. కానీ ఇది ఏమూలన సరిపోవ డం లేదంటూ రైతు సంఘాల నేతలు వాదిస్తున్నారు. ఎకరాన రూ.25 వేలు చెల్లిస్తేనే రైతులకు కొంత వరకు మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం రూ.10 వేల నష్ట పరిహారాన్ని చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో ప్రతిపక్షాలు, రైతు సంఘాల నేతలు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. అధికారంలోకి రాక ముందు ఎకరాన రూ.25 వేల నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పినా.. ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాట మారుస్తుందని ప్రతిపక్షాలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి.

పరిహారం ఊసేలేదు

పంటలు దెబ్బతిని మూడు నెలలు గడుస్తున్నా.. నష్టపరిహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఊసెత్తడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆపదలో ఉన్న రైతులకు వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు. పంటనష్టం పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. తమకేమీ సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న అధికార పార్టీ నేతలను నిలదీస్తున్నా.. సరైన సమాధానం రావడం లేదంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు కూడా సైలెంటు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. ఫసల్ బీమా అవకాశం ఉన్నా.. ఎంతో కొంత పరిహారం చేతికి వచ్చేదని రైతులు వాపోతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక రబీ పంటలను సాగుచేసే పరిస్థితి లేక రైతులు సతమతమవుతున్నా రు. గడిచిన మూడు నెలల్లోనే పలువురు రైతులు తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉసురు తీసుకుంటున్నారు. ఆపదలో ఉన్న అన్నదాతలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిండు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్న విమర్శలు వస్తున్నాయి.

13 మంది బీఆర్‌ఎస్ నాయకులపై కేసు

బోథ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన సోయాబీన్, మొక్కజొన్న పంటల కొనుగోళ్లను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సోనాల బస్టాండ్ రోడ్డు పైన ధర్నా చేసిన 13 మందిపై బోథ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడంతో పాటు అనుమతులు లేకుండా ధర్నా కార్యక్రమాన్ని చేపట్టడం చట్ట విరుద్ధమని కేసులు నమోదు చేశారు. అంతేకాక ఎలాంటి అనుమతులు లేకుండా ధర్నా కార్యక్రమాలను చేపట్టిన మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో పాటు మరికొంత మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతుల పై కేసు నమోదు అయ్యాయి.

కేసులు సమంజసం కాదు : మాజీ ఎంపీపీ

బోథ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పండించిన పంటలు కొనుగోలు చేయడం చేతగాని పాలకులు ఆందోళనకు దిగిన రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకుల పైన కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసం అని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఈ విషయై ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రైతులు అధిక వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయారని పండించిన పంటలు కొనుగోలు చేయాలని ఆందోళన చేస్తే కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. మూడు రోజుల ముందు నుంచి రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నట్లు సామాజిక మాధ్యమాలలో ప్రకటించడం జరిగింది అన్నారు. అయితే అనుమతులు లేవని అనుకుంటే మాకు ధర్నా చేయవద్దని చెప్పాల్సి ఉండేదన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ప్రజా రవాణాకు ఆటంకం కలిగించారంటూ కేసులు నమోదు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే రైతులు అయిన బీఆర్ఎస్ నాయకుల పైన కేసులు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కేసులకు భయపడేది లేదని తాము భవిష్యత్తులో రైతులతో కలిసి ప్రజా క్షేత్రంలో తెలుసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న ఆత్మ చైర్మన్ రాజుయాదవ్

రెండు రోజుల్లో సోయా పంట కొనుగోలు ప్రారంభం చేస్తాం : చైర్మన్

బోథ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోయాబీన్ పంట కొనుగోలను రెండు రోజుల్లో ప్రారంభం చేస్తామని బోత్ ఆత్మ చైర్మన్ జి.రాజుయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం బోత్ మార్కెట్ యార్డులో రైతులు పండించిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది ప్రతిపక్ష పార్టీల వారు ఉనికి కోసం ఉద్యమం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడు అన్నారు. రైతులు అధైర్యపడవద్దని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీల వారి మాటలు నమ్మవద్దని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు చేపడతారన్నారు.

ఫేక్ సర్టిఫికెట్ల మాఫియపై చర్యలు తీసుకోవాలి: రాష్ట్ర అధ్యక్షుడు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో బోగస్ సర్టిఫికేట్‌ల మాఫియాపై దృష్టి సారించాలని, ఫేక్ ఏజెన్సీ సర్టిఫికేట్‌తో ఉద్యోగాలు పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిడాం జగ్గుదేవ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని.. ఫేక్ సర్టిఫికేట్‌లతో మోసం చేసిన వారి పూర్తి వివరాలను సేకరించాలని ఆయన ఈ సందరంగా పేర్కొన్నారు. ధ్రువపత్రాలు మంజూరు చేసిన అధికారులపై సైతం విచారణ జరపాలని, ఫేక్ సర్టిఫికేట్‌లతో ఉద్యోగాలు పొందిన అరి వేతనాలను రికవరీ చేయాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగులను డిజిటల్ వెరిఫికేషన్‌కు ద్వారా పరిశీలించాలని, ఈ కుట్రల వెనక ఉన్న వారి బాగోతాలను బయటపెట్టాలన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు అవగాహన

బోథ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలములోని కుచులపూర్‌గ్రామంలోనిఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గ్రామ కార్యదర్శి అశోక్ కుమార్ మంగళవారం ఫొటో క్యాప్చరింగ్‌పై అవగాహన కలిగించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతున్న సమయంలో బిల్లుల చెల్లింపుల కోసం దశల వారీగా ఇంటి నిర్మాణపు పనుల ఫోటోలను క్యాప్చరింగ్ చేయాల్సి ఉంటుందని లబ్ధిదారులకు వివరించారు. అయితే ఈ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని లబ్ధిదారులకు సూచించారు.

'పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలి'

నేరడిగొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమీషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల వ్యవసాయధికారులు రైతులు పాల్గొనగా కమీషనర్ మాట్లాడారు. జిల్లాలో క్రాప్ బుకింగ్ ను వందశాతం పూర్తిచేసి పత్తి కొనుగోళ్లకు సంబంధించి కొత్తగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ పైన రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కొత్త యాప్ విధానాన్ని అమలు చేయడం ద్వారా మిల్లుల వద్ద పత్తి రైతులు నిరీక్షించే పరిస్థితి ఉండదని అన్నారు. గతంలో మిల్లర్లు ఎల్-1, ఎల్-2ప్రకారం పత్తిని కొనుగోలుచేసే వారని ఈ సారి ఆ విధానాన్ని రద్దుచేసి అన్ని మిల్లుల్లో పత్తి కొనుగోలు చేయడం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఇందులో మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సమసమాజ రక్షణ కోసం సుదర్శన హోమం

- పూజారులు బాలాజీ దూబే
- కార్తీకమాసం సందర్భంగా ఉట్నూర్‌లో దీపోత్సవం
- తరలివచ్చిన మహిళలు



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దయానంద సరస్వతి



కార్తీక దీపోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఉట్నూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సమసమాజారక్షణ కోసం సుదర్శన హోమం దోహదపడుతుందని పూజారులు బాలాజీ దూబే, సంతోష్ దూబేలు అన్నారు. కార్తిక దీపోత్సవం పురస్కరించుకొని రెండవ రోజు మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత మైదానంలో నిర్వహించిన దీపోత్సవం సందర్భంగా సుదర్శన హోమం నిర్వహించారు. అంతకుముందు ప్రాంగణానికి చేరకున్న గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి దయానంద సరస్వతిని స్వాగతం పాలికారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వళన చేసి ప్రజారోహణ నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు సుదర్శన హోమం నిర్వహించి హోమం ప్రాముఖ్యత గురించి వివరించారు. సుదర్శన హోమం అనేది విష్ణు భగవానుడికి ఎంతో ప్రీతికరమైనదని అన్నారు. విష్ణు భగవానుని ఆయుధమే సుదర్శన చక్రం అన్నారు. శత్రువులను నశింపజేసి, అకాల మృత్యువు రాకుండా, సమాజంలోని ప్రతీఒక్కరి ఆరోగ్యం పెంపుదల కోసం ఈ హోమం దోహద పడుతుందన్నారు. ఈ రంగంలో ఇలాంటి హోమంలో నిర్వహిస్తే విజయాలు తోడు ఉంటాయన్నారు. శరీరం, అందం, ఆస్తులు, అంతస్తులు ఎవరికి శాశ్వతం కాదని ప్రతీ ఒకరి శరీరంలో ఆత్మ అద్దెకు ఉంటుందని, పరమాత్ముడు ఆదేశిస్తే ఆత్మ వెళ్లిపోతుందని, ఆత్మలో పరమాత్ములు అంతరాత్మగా ఉంటాడన్నారు. అదేవిధంగా అజ్ఞానం తొలగించి, కలగజేయడానికి సుదర్శన హోమం అండగా ఉంటుందన్నారు. సుదర్శన హోమం అనంతరం మహిళల ఆధ్వర్యంలో కార్తిక మాసోత్సవం పురస్కరించుకొని సామూహిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ ప్రతినిధి శివకుమార్, మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్, కార్యవాహ డాక్టర్ సాడిగే రాజగోపాల్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు శ్రీరాం నాయక్, కొండేరి రమేష్, లింగన్న, బింగి వెంకటేష్, కొండగట్టు అంజన్న, సుమన్ జాదవ్, హరికృష్ణ, పాల్గొన్నారు.



వాగ్దారిలో టీకాలు వేస్తున్న డాక్టర్ రాథోడ్ జీవన్



నాగపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

గాలికుంటు టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

● మండల పశువైద్యాధికారి జీవన్

నేరడిగొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని మండలంలో రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. మంగళవారం మండలంలోని వాగ్దారి గ్రామాల్లో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలను ఏరాcటు చేసి, పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు వ్యవసాయంతో పాటు పశు పోషణపై కూడా దృష్టి సారించాలని అన్నారు. పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతున్నది. పశు వైద్యాధికారులు సిబ్బందితో కలిసి గ్రామాలలో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పశువైద్య అధికారులు ప్రతి పశువుకు ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేయించాలని సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో పశువులకు గాలికుంటు వ్యాధితో పాటు ఇతర వ్యాధులు సోకే అస్కారం ఉంటుందని వివరిస్తున్నారు.

ఇచ్చోడ: పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య సిబ్బంది పేర్కొన్నారు. మంగళవారం ఇచ్చోడ మండలంలోని జల్దా గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. బుధవారం మండలంలోని చించోలి గ్రామంలో నివారణ టీకాల కార్యక్రమం ఉందని పాడిరైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంధ్య, రమేష్, శేఖర్, శ్రీనివాస్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై విష్ణువర్ధన్

మహిళల భద్రత కోసమే షీ టీం : సీఐ

ఆదిలాబాద్(ఆదిలాబాద్ రూరల్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అనుకుంట మహాత్మ జ్యోతిబాపూలే మహిళ పాఠశాలలో సీఐ ఫణిందర్ ఆదేశాలనుసారం విద్యార్థినులకు షీ టీంలపై, ఫోక్సో చట్టంపై, ఆడ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం ఎస్సై విష్ణువర్ధన్, డబ్ల్యూపీసీ ఉమెన్ ఆఫీసర్ సుకన్యతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అలాగే అన్ని కళాశాలలు, విద్యా సంస్థల వద్ద, ప్రధానమైన కూడళ్లలలో షీ టీం నిత్యం ఉంటారన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. లోన్ యాప్‌లు, మొబైల్ ఫోన్‌లలో వచ్చే ఫేక్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులను ఎవరైన లైంగిక వేధింపులకు గురి చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థినులు సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. వచ్చే వార్షిక పరీక్షలలో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రణాళిక బద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్(సిరికొండ), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సోయా, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, పంటలు కొనుగోళ్లు ప్రారంభించాలని మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన్ వాడ్ అమోల్ మాట్లాడుతూ 15 రోజులు క్రితమే సోయా, మొక్కజొన్న పంటల కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం మండల కేంద్రంలో ప్రారంభించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే రైతులు సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్ళు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతుల సమక్షంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ పెందూర్ అమృత్ రావ్, గోర్బండ్ బాలాజీ, పెంట గంగాధర్, మాజీ సరంచ్ గుణవంత్ రావ్, గెడం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

'సూర్యవంశీ సేవలు చిరస్మరణీయం'

నార్నూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దళిత సమాజ హక్కులు కోసం నిరంతరం ప్రభుత్వంతో పోరాటాలు చేసిన ఉద్యమ నేత నార్నూర్ పాక్స్ రైటర్ ఉద్యోగి పండరి సూర్యవంశీ సేవలు చిరస్మరణీయం బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి సయ్యద్ ఖాసిం అన్నారు. మంగళవారం వారి స్వగృహంలో పుణ్యతిథి కార్యక్రమాన్ని హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు కలిసి ప్రగాఢ సానుభుతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంత దళిత ఇతర వర్గాల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి ముఖ్యంగా భక్తి సన్మార్గం కోసం మతంగ్ ఋషి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా మంచి సందేశాలు ప్రాంతవాసులకి ఇచ్చారు. వారి వెంట పాక్స్ డైరక్టర్ కాంతరావు దూర్గే, అశ్విన్, బాపురవు, దిలీప్ ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఆదిలాబాద్‌లో ప్రమాదాల నివారణపై సూచనలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్నూల్‌లో జరిగిన బస్సు అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యాయి. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆర్టీసీ డ్రైవర్లకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం ఆదిలాబాద్ డిపోలో అగ్నిమాపక శాఖ అధికారులు ప్రమాదం జరిగిన సమయంలో ఏ విధంగా మంటలను అదుపు చేయాలో, ప్రాణ నష్టం జరగకుండా ప్రయాణికులను ఎలా సురక్షితంగా బయటకు తీయాలో ప్రాక్టికల్‌గా చూపించారు. డ్రైవర్లకు ప్రమాద సమయంలో అగ్నిమాపక పరికారల వాడకంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం ప్రతీమారెడ్డి మాట్లాడుతూ... ఇటీవల ప్రైవేట్ బస్సులో జరిగిన అగ్నిప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధకరమన్నారు. ప్రయాణీకుల భద్రతకే ఆర్టీసీ పెద్ద పీఠ వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం ప్రతీమారెడ్డి, ఎంఎఫ్ శ్రీకర్, సీఐ రాజశేఖర్, స్టెషన్ ఫైర్ ఆఫీసర్ జైత్రం, ఎల్ఎఫ్ సుంగన్న, మోహన్ పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రం కోసం స్థల పరిశీలన

భీంపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషాను భీంపూర్ మండల బీఆర్ఎస్ రైతు విభాగం నాయకుడు గుర్ల నరేందర్ యాదవ్ రైతులతో కలిసి వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు స్థల పరిశీలన చేయాలని మంగళవారం ఆదేశించగా వారు కరంజి(టి),అర్లి (టి) మండల కేంద్రం భీంపూర్‌లలో అనువైన స్థల పరిశీలన చేశారు. దీంతో భీంపూర్ రైతులు కలెక్టర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మార్క్‌ఫెడ్ ఎగ్జిక్యూటివ్ ప్రేమ్‌సింగ్, తాంసి పీఏసీఎస్ సీఈవో కేశవ్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

కరెంట్ షాక్‌తో గేదె మృత్యువాత

మావల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టి సవర్గం గ్రామానికి చెందిన మిటిపెల్లి వెంకట్ రెడ్డి అనే రైతుకి చెందిన గేదె గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్ తగిలి మృతి చెందింది. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. పశు వైద్యాధికారి రజినీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

ఆధునిక పోకడలతో మారిన జీవన విధానం మనిషిని ఆరోగ్యపరంగా అతలాకుతలం చేస్తోంది. దీంతో బ్రెయిన్ స్ట్రోక్ లాంటి ప్రమాదకరమైన వ్యాధి బారిన పడి ఉన్న ఫలంగా మనిషి అవయవాలలో చలనం కోల్పోయి కదలలేని పరిస్థితికి వెళ్తున్నారు. ఒక దశలో ఈ స్ట్రోక్ బారిన పడిన వారిలో కొంతరు త్వరగా రికవరీ అవుతుంటే మరికొందరు ప్రాణాలను సైతం కోల్పోయిన ఘటనలు తరచుగా కనిపించడం పారిపాటిగా మారింది. పక్షవాతాన్ని నివారించేందుకు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు వరల్డ్ స్ట్రోక్ అర్గనైజేషన్ ముందుకు వచ్చింది. ప్రతి సంవత్సరం అక్టోబరు 29వ తేదీని 'వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే'గా నిర్వహిస్తున్నారు. నేడు ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ దినం సందర్భంగా ప్రత్యేక కథనం..



మెదడు పోటు.. మహా చేటు

పక్షవాతం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

డాక్టర్ చింతపండు రవి కుమార్, ఆర్ఎంవో, నిర్మల్



బ్రెయిన్ స్ట్రోక్(పక్షవాతం వచ్చిన) బారిన పడిన వ్యక్తిని వెంటనే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తరలించాలి. వ్యక్తిలో ముఖం ఒకవైపు వంగిపోవడం, ఒక చేయి బలహీనంగా మారడం, మాట తడబడం లేదా అర్థం కాకపోవడం లాంటి లక్షణాలు కనబడగానే వెంటనే అత్యవసర వైద్య సేవలను అందించాలి. రక్తపోటు, మధుమేహం, ధూమపానం, ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్ వంటివి బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీసే ప్రధాన కారణాలు. నిరంతర వ్యాయామం దీర్ఘకాలిక వ్యాధులు నియంత్రణతో బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు నుంచి తప్పించుకోవచ్చు.

- జీవన శైలి మార్పుతోనే బ్రెయిన్ స్ట్రోక్‌కు చెక్.
- మానసిక ఒత్తిడి నియంత్రణనే అత్యంత కీలకం
- క్రమం తప్పని వ్యాయామం ప్రధానం
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే

ఖానాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మానవ శరీంలో మెదడుకు రక్త సరఫరా నిలిచిపోయినప్పుడు బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని(పక్షవాతం ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ బ్రెయిన్ స్ట్రోక్‌లలో ఇస్కిమిక్ స్ట్రోక్ అనేది మెదడులోని రక్తనాళాలలో రక్తం గడ్డ కట్టడం లేదా కొవ్వు నిల్వలు పేరుకుపోవడం వల్ల మెదడుకు రక్త ప్రసరణ నిలిచిపోతుంది. హేమరేజిక్ స్ట్రోక్‌లో రక్తనాళం పగిలిపోవడం (చిట్లిపోవడం) వల్ల మెదడులోకి రక్తం లీక్ అవుతుంది. రక్త ప్రవాహంలో తాత్కాలిక అడ్డంకులు ఏర్పడినప్పుడు తాత్కాలిక ఇస్కిమిక్ అటాక్ అనేది సంభవిస్తుంది. ఇది బ్రెయిన్ స్ట్రోక్ హెచ్చరిక లాగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ప్రమాదానికి కారకాలు..

ప్రమాదకరమైన బ్రెయిన్ స్ట్రోక్‌కు మనిషి గురవ్వడానికి మారిన నేటి మానవ జీవనశైలియే ప్రధాన కారణంగా నిలుస్తోంది. నియంత్రణ లేని రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, మద్యం సేవించడం, ఊబకాయం, రక్తనాళాల్లో కొవ్వు నిల్వలు పేరుకుపోవడం (అథెరోస్కె రోసిస్) లాంటి వాటి ద్వారా రక్తనాళాలలో సమస్యలు తలెత్తి మెదడుకు రక్తప్రసరణ నిలిచిపోయినప్పుడు మనిషి బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడతాడని వైద్య నిపుణులు చెబుతున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు...

బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడే ముందు సదరు వ్యక్తిలో కొన్ని లక్షణాలు ముందస్తుగా కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో ఒకవైపు తిమ్మిరి, బలహీనత, మాట తడబడడం, చూపు మసకబారడం, ఒక్కరు ఇద్దరుగా కనిపించడం, నడకలో ఇబ్బందులు తలెత్తడం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు లాంటివి సంభవిస్తాయని చెబుతున్నారు. ఈ లక్షణాలను బ్రెయిన్ స్ట్రోక్ ప్రారంభ లక్షణాలుగా పరిగణించి వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు...

బ్రెయిన్ స్ట్రోక్ లాంటి ప్రమాదకరమైన వ్యాధి బారిన పడకుండా ముందస్తుగానే జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. నిరంతర వ్యాయామం శరీరంలో ప్రతి అవయవానికి రక్తప్రసరణను సమపాళ్లలో ఉంచుతుందని సూచిస్తున్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధులను పెరగకుండా చూసుకునేందుకు నిరంతరం ధ్యానం, వ్యాయామం, యోగాసనాలు వంటివి చేయాలని సూచిస్తున్నారు. ఇటు వ్యాయామంతో పాటు అటు ఆహారపు అలవాట్లను సైతం మార్చుకోవాలని చెబుతున్నారు. అవిసే గింజలు, వాల్‌నట్స్, సోయాబీన్స్ వంటి వాటిని నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. వీటిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరంలో కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయ పడతాయని సూచిస్తున్నారు. చక్కెర, నూనెలో వేయించిన పదార్థాలను తినడం మానేయడంతో పాటు ఆహారంలో తాజా పండ్లు, ఆకుపచ్చ కూరగాయలు, తృణ ధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. వ్యాయామం, ధ్యానం, యోగా ఆహారపు అలవాట్లలో మార్పులతో బ్రెయిన్ స్ట్రోక్‌కు చెక్ పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌రూరల్/నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ జిల్లాకలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని అనంతపేట్‌గ్రామంలో ఐకేపీఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్, తదితర సౌకర్యాలను పరిశీలించారు. తప్పనిసరిగా సరిపడినన్ని గన్ని సంచులు, టార్పాలిన్లు,తేమ యంత్రాలు, తూకపు యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న సామాగ్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు రైతులకు త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. సరిపడినంత మంది సిబ్బంది ప్రతిరోజు కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల వివరాలు, మద్దతు ధర, టోల్ ఫ్రీ నంబర్, తదితర వివరాలు రైతులకు తెలిసేలా బ్యానర్లను ప్రదర్శించాలని చెప్పారు. రైతులతో ప్రతి రైతు తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి మాత్రమే అమ్మాలని సూచించారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులను నమ్మి మోసపోవద్దని చెప్పారు. తప్పనిసరిగా తమ ధాన్యాన్ని శుభ్రపరచిన తర్వాతనే ధాన్యాన్ని అమ్ముకోవాలని తెలిపారు. దీనిద్వారా రైతులకు అధిక ధర లభిస్తుందన్నారు.ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, తహసీల్దార్ ప్రభాకర్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన నూతన ఎంపీడీవోలు

గ్రూప్- 1 పరీక్షలో అర్హత సాధించి, ఇటీవల జిల్లాలోని నాలుగు మండలాలకు కేటాయించబడిన నలుగురు ఎంపీడీవోలు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను సోమవారం రాతి వారి కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీవో విధులు, బాధ్యతలు గురించి వివరించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న పథకాలన్నీ అర్హులైన పేదలందరికీ అందేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కష్టపడి పని చేస్తూ, విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని, ఉద్యోగ జీవితంలో భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసిన నూతన ఎంపీడీవోలు

వైద్య, నర్సింగ్ కళాశాలల నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహించాలి

జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు పకడ్బందీగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆర్ అండ్ బి శాఖ పరిధిలో జరుగుతున్న ఈ పనులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మొత్తం 25 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల భవనాలు, రహదారులు, ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. కళాశాల ప్రధాన భవనం, రోడ్డు నిర్మాణం, బాలక, బాలికల వసతి గృహాలు, ప్రిన్సిపాల్, సూపరింటెండెం ట్ వసతి గృహాలు, అతిథి గృహం, ఇతర విభాగాల పనులు ప్రస్తుతం ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడానికి, అన్ని సదుపాయాలతో కూడిన ఆధునిక కళాశాలను రూపుదిద్దుతున్నామని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పత్తి పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభం

జిల్లాలో పత్తి పంట కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాయలంలో సంబంధిత శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీసీఐ సంస్థ సమయానికి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుండి పత్తి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ సౌకర్యం కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు పత్తి అమ్మకానికి సంబంధించిన స్లాట్‌లను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. యాప్ వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రైతు వేదికల ద్వారా గ్రామాల్లో ఏవోలు, ఏఈవోలు రైతులకు కపాస్ కిసాన్ యాప్ వినియోగం గురించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. రైతులు తేమ శాతం కారణంగా నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వరి పంటకు ఖచ్చితంగా మద్దతు ధర అందేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, కాటన్ పర్చేసింగ్ ఆఫీసర్స్ ఓం బూట్లే, ఈరన్నతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

బీమా చెక్కుల అందజేత

తానూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని జౌల(బి), బోసి గ్రామాలకు చెందిన వార్లే అరుణ, ఖాదిర బీలు ఇటీవల మృతి చెందారు. కాగా వ్యవసాయ సంఘ హంగిర్గలో వీరికి బీమా ఉన్నందున రూ. 2లక్షల బీమా మంజూరు అవ్వడంతో నామినిలకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగనాథ్, డైరెక్టర్లు పుండలీక్, గజానన్, అక్బర్, ప్రకాష్, సెక్రటరీ భూమయ్య, సంఘం సిబ్బంది, బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, సూపర్‌వైర్ రాకేష్ పాల్గొన్నారు.

పంటల నమోదు సక్రమంగా చేయించుకోవాలి

డీఏవో అంజి ప్రసాద్



కల్లూరు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయాధికారులు

కుంటాల,అక్టోబరు, 28 : (ఆంధ్రజ్యోతి) : రైతులు ఖరీఫ్ సీజన్‌లో వారి వారి వ్యవసాయ భూములలో సాగు చేసిన పంటల నమోదు వివరాలను తమ సిబ్బంది వద్ద సక్రమంగా నమోదు చేయించుకోవాలని డీఏవో అంజి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు రైతు వేదికలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా ఆయన రైతులకు కిసాన్ కపాస్ బుకింగ్ యాప్, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఉత్పత్తులు విక్రయించే విధానంపై స్థానిక రైతు వేదికలో కార్యక్రమం కొనసాగింది. ఈసందర్భంగా స్థానిక రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వం మద్దతు ధర అందించాలనే ఉద్దేశంతో కొనుగోళ్లు చేపడుతున్న కేంద్రాల్లో రైతులు చేపట్టవలసిన పలు పద్దతులపై వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం స్థానిక జిల్లా,మండల వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటలు విక్రయించే సమయంలో సరైన తేమ శాతంతో కూడిన ధాన్యాన్ని మాత్రమే తీసుకెళ్లి విక్రయించాలన్నారు. అంతేగాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో దళారులు ఎవరైనా ధాన్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అడెల్లి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠాపన

సారంగాపూర్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి) : సారంగాపూర్ మండలంలో మహా ప్రసిద్ధి గాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయ నూతన విగ్రహ ప్రతిష్టపను నవంబర్ నెల 7వ తేదిన శుక్రవారం చేయనున్నట్లు ఆలయ చైర్మన్ సింగం భోజాగౌడ్, ఆలయ ఇంచార్జీ ఈవో భూమన్నలు ఒక ప్రకటనలో తెలిపారు.ఈనేపథ్యంలో ఈ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా వారం రోజుల పాటు ఆలయం వద్ద ఆధ్యాత్మికంగా వారం రోజుల పాటు వద పారాయణలు చండిహోమం రుద్ర హోమం,కుంబాభీషేకం,నిర్వహించబడుతాయని పేర్కొన్నారు. దీంతో పాటు అన్నదాన కార్యక్రమంలో ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తులు అడెల్లిపోచమ్మ మాలాధారణ ధరించనున్నట్లు తెలిపారు. ఈవిగ్రహప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తులు హాజరై అమ్మవారి సేవలో పాల్గొనాలని పేర్కొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ

భైంసా/ముథోల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):రోజుకోరీతిలో పెరుగుతున్న సైబర్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒకరూ అప్రమత్తంగా వ్యవహరించాలని భైంసా టౌన్ సీఐ గోపినాథ్ సూచించారు. మంగళవారం మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని పులేనగర్ కాలనీ పరిధిలో గల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త సాంకేతిక విధానాలతో మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వీటి బారిన పడకుండా ఉండేందుకు బ్యాంక్ అకౌంట్ల పాస్‌వర్డులు, ఓటీసీ నెంబర్లు తెలిపే విషయంలో జాగరుకతతో నడుచుకోవాలన్నారు. కొత్త నెంబర్ల ద్వారా సెల్ ఫోన్లకు వచ్చే లింక్‌లను ఒపెన్ చేయకూడదన్నారు. మోసాలబారిన పడినట్లుగా భావించిన, గుర్తించిన వెంటనే పోలీసుశాఖకు సంప్రదించాలని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకే పోలీసు శాఖ నిరంతరం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తుందని వెల్లడించారు.అసాంఘిక కార్యకలపాల కట్టడి చేసేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో అనుమానితంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. భైంసా పట్టణాన్ని నేరరహిత పట్టణంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు రక్షణ కల్పించేందుకు తాము పని చేస్తున్నామని వివరించారు. బెట్టింగ్ నిర్వాహకుల మాయమాటలకు, ప్రలోభాలకు తలొగ్గితే అన్ని విధాలుగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. బెట్టింగ్ మాయజాలంలో పడితే జీవితాలు బుగ్గిపాలవుతాయని వెల్లడించారు. కోలుకోలేని రీతిలో కష్టనష్టాల పాలవుతారని, సమజాంలో గౌరవ మర్యాదలకు దూరమవుతురాని వివరించారు. నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యమని, ఆ దిశగా ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైన గంజాయి సేవించడంగానీ,విక్రయించినట్లు,రవాణాచేస్తున్నట్లు ఉంటే వెంటనే 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.ఈసందర్భంగా సరియైన ధ్రువీకరణ పత్రాలు లేని పలువాహనాలను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు.ముథోల్ మండలంలోని చించాల గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల గురించి, మూఢ నమ్మకాలు, గంజాయి, పొగ తాగడం, మద్యం సేవించడంపై కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. మెజీషియన్ సుధాకర్ మూఢ నమ్మకాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన, ప్రొజెక్టర్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ అమ్మ నాన్న కన్న కలలను సహకారం చేసుకోవాలని ఎస్సై బిట్ల పెర్సెస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాజాత బృందం, మెజీషియన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సీఐ గోపినాథ్

క్రైం సమాచారం

అప్పుల బాధ భరించలేక ఒకరి ఆత్మహత్య



మృతుడి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

లోకేశ్వరం,అక్టోబరు28 (ఆంధ్ర జ్యోతి): అప్పుల బాధ భరించ లేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం దండే గంగన్న(53) లోకేశ్వరం మండలంలోని మోహల గ్రామానికి చెందిన దండే గంగన్న పెద్ద కూతురుకు ఇటీవలే పెళ్లి చేశాడు. పెళ్లికి అయిన అప్పు ఎలా తీర్చాలో అర్థంకాక మనస్తాపం చెంది ఇంటికి దగ్గరలో ఉన్న వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారం భించామని లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత



ఎద్దు మృత కళేభరం

ముథోల్,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలో ని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన జానగారి సాయి మోహన్ రెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దు మంగళ వారం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. బాధిత రైతు కథనం ప్రకారం వ్యవసాయ చేనులో ఎద్దు మేసుకుంటూ వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదా ఘాతంతో అక్కడికక్కడే మృతి చెందిందని, దీని విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. సంఘటన స్థలాన్ని విద్యుత్, పశువైద్య అధికారులు పరిశీలించారు.

పశువులను ఎత్తుకెత్తిన దొంగలు

బోథ్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని టీవీటీపల్లి గ్రా మం నుంచి సోమవారం అర్ధరాత్రి నాలుగు పశువులను ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. గ్రామానికి చెందిన జైతు అనే రైతుకు చెందిన ఒక ఆవు మేశ్రం ఇస్రు అనే రైతుకు చెందిన మూడు ఆవులను దొంగలు ఎత్తుకెళ్లారని తెలిపారు.అర్ధరాత్రి మ్యాక్స్‌ట్రాలీ వాహనంలో వచ్చిన దొంగలు గ్రామం సమీపంలోని పెంటకుప్పల పక్కన వాహనాన్ని నిలిపి రైతుల ఇండ్ల వద్ద కట్టి ఉంచిన ఆవులను వాహనంలో ఎక్కించి తీసుకు వెళ్లారని గ్రామస్థులు పేర్కొన్నారు.అయితే దొంగల అలజడి విన్న గ్రామస్థులుకేకలు వేయడంతో వాహనంలో ఎక్కించినఆవులతోపరారయ్యారన్నారు. ఆవును ఎక్కించే ప్రయత్నం చేస్తుండగా గ్రామస్థుల అలజడి విని ఒక ఆవు ను విడిచి పెట్టినట్లు తెలిపారు. నాలుగు ఆవులతో పరారవుతున్న వాహనాన్ని గ్రా మస్థులు వెంబడించగా బోథ్ రోడ్డు వైపు పరారయ్యారని రైతులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పోలీసుస్టేషన్‌లో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



బాధితురాలికి బ్యాగును అందిస్తున్న పోలీసు

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్) అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):ఉ ట్నూర్‌లో నివాస ముండే సునీత దీపావళి పండుగ కోసం మహారాష్ట్రకు వెళ్లి తిరిగి ట్రైన్‌లో వచ్చి స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఆటోలో బస్టాండ్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఆటోలో తన బంగారు, వెండి ఆభరణాలు కలిగిన బ్యాగును మరిచిపోయింది. వెంటనే బస్టాండ్‌లోని పో లీస్ సబ్ కంట్రోల్లో ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఏఆర్ ఎస్సై ఎల్. దినకర్, మహిళ కానిస్టేబుల్ అపర్ణ కలిసి బాధితురాలి పిల్లలు తెలిపిన ఆధారాల ప్రకారం ఆటో కోసం అన్వేషించారు. ఆటో డ్రైవర్ జావీద్ నిజాయితీగా బ్యాగును సబ్‌కంట్రోల్ పోలీసులకు ఇవ్వగా, వీరందరూ బాధితురాలికి తిరిగిబ్యాగును అప్పగించారు. విధినిర్వహణలో నిజాయితీగా స్పందించి, ఆటోకై అన్వేషించి దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేసే విధంగా కృషి చేసిన సిబ్బందిని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆటో డ్రైవర్ జావిద్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేటి నుంచి సోయా కొనుగోలు కేంద్రాలు



మాట్లాడుతున్నఎమ్మెల్యే పవార్ రామారావ్

భైంసా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర కల్పించే లక్ష్యంతో బుధవారం నుంచి భైంసా డివిజన్ పరిధిలో ప్రభుత్వ రంగ సంస్థలతో సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ వెల్లడించారు. మంగళవారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.ముథోల్ నియోజక వర్గ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన కొనుగోలు కేంద్రాలను బుధవారం ఉదయం 9గంటలకు భైంసాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ అవరణలో లాంచనంగా ప్రారంభించనున్నట్లుగా వివరించారు. మొంథా తుఫాను ప్రభావం దృష్ట్యా ప్రతికూల వాతవరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నియోజక వర్గ పరిధిలోని కొనుగోలు కేంద్రాలన్నింటిని ఇక్కడి మార్కెట్ యార్డు నుంచి ప్రారంభించనున్నట్లుగా తెలిపారు.సోయా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు.

● మూడు చెరువుల మరమ్మతులకు రూ.2.7 నిధులు మంజూరు

నియోజక వర్గ పరిధిలో 2023లో కురిసిన భారీ వర్షాల మూలంగా దెబ్బతిన్న మూడు చెరువుల మరమ్మతులకు రూ.2.7 కోట్ల నిధులు మంజూరైనట్లుగా ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ వెల్లడించారు. బాసర మండలంలోని బిద్రెల్లి గ్రామ పరిధిలోని లాబ్ది రోడ్డు చెరువుకు రూ.1.15 కోట్లు, కుబీర్ మండలంలోని డొడర్న గ్రామ పరిధిలోని సిల్ట్ అరెస్టింగ్ ట్యాంక్‌కు 89.15 లక్షలు, తానూర్ మండలంలోని హిప్నెల్లి ఎల్‌బీ ట్యాంక్ చెరువుకు రూ. 66.45లక్షలు మరమ్మత్తుల కోసం గాను మంజూరయ్యాయని వివరించారు.తద్వారా సంబంధిత మూడు చెరువుల కింద గల 570 ఎకరాల అయకట్టు భూములకు సాగు నీరు అందనుందని వివరించారు. ఇందుకు సంబంధించిన పాలనపరమైన అనుమతులు లభించాయని త్వరలోనే టెండర్ ప్రక్రియ నిర్వహింప చేసి పనులు ప్రారంభింప చేస్తామని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో భైంసా మండల మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, తానూర్ బీజేపీ ప్రతినిధి చక్రు పాటిల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
బుధవారం 29 అక్టోబరు 2025





మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఈ యేడు కురిసిన.. భారీవర్షాలు, వరదల కారణంగా పంటలు నీటమునిగి తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లాలో వేల ఎకరాల పంటలు వరద నీటి పాలయ్యాయి. పెన్‌గంగా పరివాహక ప్రాంతంలోని పంటలు రోజుల తరబడి నీట మునిగి ఉండడంతో పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఎన్నో ఆశలతో పంటలను సాగు చేసినా.. చేతికి వచ్చే దశలో వరదలు ముంచెత్తాయి. జిల్లాలో 12,775 మంది రైతులకు గాను 17,496.9 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నివేదికను ప్రభుత్వానికి పంపించారు.



పరిహారం.. ఇంకెప్పుడు?

- నష్ట పరిహారం కోసం తప్పని ఎదురు చూపులు
- ఎకరానికి రూ.10 వేల పరిహారాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- మూడు నెలలు గడుస్తున్నా.. అందని సర్కారు సహాయం
- అప్పుల భారంతో దిక్కులు చూస్తున్న అన్నదాతలు

ఆదిలాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈయేడు ఆగస్టు, సెప్టెంబరులలోనే భారీ వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడంతో పంటలన్నీ వరద నీటికి కొట్టుకుపోయాయి. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలను పరిశీలించా రు. కన్నీటి పాలైన రైతులను అన్నిరకాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. పంటల నష్టంపై జిల్లా అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు ఎంతో హడావుడి చేశారు. కానీ ప్రభుత్వం నష్ట పరిహారంపై ఊసెత్తక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. దాదాపుగా వానాకాలం సీజన్ ముగుస్తున్నా.. నష్టపరిహారం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా త్వరలోనే ప్రారంభమయ్యే రబీ సీజన్ పంటల సాగుకు చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి

: నారకట్ల మాధవ్, రైతు, జైనథ్ మండలం



భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలి. పంటలను సాగు చేసేందుకు చేసిన అప్పులను తీర్చేందుకు రైతులు మళ్లీ అప్పులు చేసే పరిస్థితి ఏర్పడుతుంది. వరుస నష్టాలతో రైతులు అప్పుల్లో కూరుకు పోతున్నారు. పండించిన పంటలు వడ్డీకి కూడా సరిపోవడం లేదు. ప్రతి యేటా ఏదోరకంగా నష్టం వాటిల్లుతూనే ఉంది. ఆపదలో ఉన్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఎకరాన రూ.25 వేల పరిహారం చెల్లిస్తేనే పెట్టిన పెట్టుబడులు సరిపోతాయి.

భారీ వర్షాలు, వరదలతో నీట మునిగిన పంటలు



ఇటీవల భారీ వర్షాలకు నీట మునిగిన సోయాబీన్ పంట(ఫైల్)

అందని సహాయం

ప్రభుత్వం అందించే పంట నష్ట పరిహారం కోసం రైతులు నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ యేడు వానాకాలం సీజన్‌లో అప్పు చేసి పంటలను సాగు చేసినా.. చేజారి పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా పత్తి, సోయా, కంది, జొన్నపంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతుల దిగుబడి అంచనాలు తలకిందులయ్యాయి. ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను సాగు చేసే పరిస్థితి లేక పంట భూములను వృధాగా వదిలేశారు. అప్పటికే

(తరువాయి 6వ పేజీలో....)

జిల్లాలో దెబ్బతిన్న పంటల వివరాలిలా..

పత్తి	: 13,804.11 ఎకరాలు
సోయాబీన్	: 2,941.28 ఎకరాలు
కంది	: 308.9 ఎకరాలు
మొక్కజొన్న	: 290.29 ఎకరాలు



సీఎంఆర్ సరఫరాను వేగవంతం చేయాలి: కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులు, రైస్ మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సి.ఎం.ఆర్ సరఫరా పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సన్నబియ్యం మిల్లింగ్, సరఫరా పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయాలని సూచించారు. సివిల్ సప్లై కమిషనర్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మిల్లర్‌లు సీఎంఆర్ సరఫరా చేయకపోతే ఆర్‌ఆర్ చట్టం కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. 2023-24 సీజన్‌కు సంబంధించిన మిగిలిన నాన్ అకౌంటెడ్ మిల్లర్ల వద్ద ఉన్న సన్న బియ్యాన్ని తక్షణం సరఫరా చేయాలని ఆదేశించారు. డిసెంబర్ చివరి నాటికి వందశాతం సి.ఎం.ఆర్ సరఫరా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వారం మిల్లర్‌లు తమ సరఫరా పురోగతిపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. బ్యాంకు రుణ సౌకర్యాల వినియోగంలో మిల్లర్‌లు తమ మిల్లింగ్ సామర్థ్యం, ఎఫ్‌సీఐ మార్గదర్శకాల మేరకే రుణాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లర్‌లు సక్రమంగా సన్నబియ్యం మిల్లింగ్ చేసి, సమయానికి సివిల్ సప్లై గోదామ్‌లకు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, జిల్లా సివిల్ సప్లై అధికారి నందిని, డిఎం సుధారాణి, అధికారులు, పలు రైస్ మిల్లర్ల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భీంపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి కరంజీ(టీ) వెళ్లే బస్సులు ఉదయం సాయంత్రం పాఠశాల విద్యార్థుల సమయానికి వేయాలని కోరుతూ ఈ నెల 25న ఆంధ్రజ్యోతిలో బస్సులు రాక విద్యార్థుల ఇబ్బందులు శీర్షికన కథనం వచ్చింది దీనితో స్థానిక నాయకులు సోమవారం సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్‌లు ఆర్టీసీ డీఎం ప్రతిమ రెడ్డితో ఈ విషయం మాట్లాడారు. స్పందించిన డీఎం కరంజి టి రూట్‌లో విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళే సమయంలో, సెలవు తరువాత గ్రామాలకు వెళ్ళే సమయాల్లో బస్సులు ప్రారంభించారు. దీంతో మంగళవారం బస్సును ప్రారంభించారు. దీనితో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కరంజి(టీ)లో బస్సు దిగుతున్న విద్యార్థులు

ప్రజలకో న్యాయం.. అధికారులకో న్యాయం!

- అటవీశాఖ అధికారుల పక్షపాత ధోరణి
- అటవీశాఖ అధికారి సోదరుడి ట్రాక్టర్ ట్రాలీని విడిచిపెట్టిన వైనం

ఇచ్చోడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలుతున్న ఇసుకను అడ్డుకోవడంతో వింత పోకడలను చూపిస్తున్నారు అటవీశాఖ అధికారులు. అటవీశాఖకు చెందిన ఓ అధికారి సొదరుడి ట్రాక్టర్‌ను మినహాయించి మిగితా 12 ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. అటవీ అధికారులు, ట్రాక్టర్ యజమానుల వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని బావోజీపేట్ నుంచి ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరాఫరా చేస్తున్న 12 ట్రాక్టర్‌లను అటవీ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. రెవెన్యూ పరిధిలో నుంచి కాకుండా అటవీ పరిధిలో నుంచి ఇసుకను తరలిస్తున్నారని ట్రాక్టర్లను ఇచ్చోడ అటవీశాఖ కార్యాలయాలకు తరలించి కేసులు నమోదు చేశారు. దీంతో ఇసుక ట్రాక్టర్లు అన్ని అటవీ కార్యాలయంలో ఉండిపోయాయి. ఇదిలా ఉండగా మంగళవారం అదే ప్రాంతం నుంచి ఓ అటవీ అధికారి సొదరుడి ట్రాక్టర్ ఇసుక నింపుకుని ఇచ్చోడకు తరలిస్తుంచడంతో ట్రాక్టర్ల యజమానులు వారికో న్యాయం.. మాకో న్యాయమా? అంటూ చర్చించుకున్నారు. అయితే, ఈ విషయమై.. అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా.. మేడిగూడ చెక్‌పోస్టు నుంచి సమాచారం రావడంతో ఇచ్చోడలో ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్ ఇంజన్ మాత్రమే ఉందని ట్రాలీ లేకపోవడంతో ఇంజన్‌ను అటవీశాఖ కార్యాలయానికి తరలించామని విచారణ కొనసాగిస్తున్నామని డీఆర్‌వో ఇబ్రహీం షరీఫ్, ఎఫ్‌బీవో నౌషిలాల్ తెలిపారు.



ట్రాక్టర్ ఇంజన్‌ను ఇచ్చోడ అటవీశాఖ కార్యాలయానికి తరలించిన దృశ్యం



పథ సంచాలన్ నిర్వహిస్తున్న సభ్యులు

ఉట్నూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచాలన్

ఉట్నూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ఉట్నూర్ ఖండ ఆధ్వర్యంలో మంగళవారం పథ సంచాలన్ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని లక్కారం అభయాంజనేయ హనుమాన్ మందిరం నుంచి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం వినాయక్‌చౌక్ వరకు పథ సంచాలన్ నిర్వహించారు. స్వయం సేవకులు ఏకరూప దుసులు, తలపై టోపీ, భుజంపై దండలు ధరించి లయబద్ధమైన అడుగులతో కమనీయంగా నిర్వహించారు. కొండగట్టు అంజన్న, రామగిరి శ్రీనివాస్, రామిని ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలో 24 గంటల పాటు సేవలు

- భీంపూర్ ఎస్సై విక్రమ్
- ప్రధాన వీధుల గుండా కొవ్వొత్తుల ర్యాలీ
- సిరికొండలో సైకిల్ ర్యాలీ

భీంపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసు అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకొని మంగళవారం రాత్రి కస్తూర్బా విద్యాలయం విద్యార్థులతో క్రొవత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విక్రమ్ మాట్లాడుతూ ప్రజా సేవలో 24 గంటల పాటు సేవలు అందించే పోలీసులు దేశ చరిత్రలో కీలకమైన బాధ్యతలు నిర్వర్తించే వారిగా నిలిచిపోతారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వీధుల నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం అమరులైన పోలీసులు సేవలు అందరూ గుర్తుంచుకోవాలన్నారు. తరువాత అమరులైన పోలీసులకు ఘన నివాళియర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది దినేష్ రాథోడ్, సంజయ్, మధుకర్, విద్యార్థులు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్(సిరికొండ): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి అని ఏఎస్సై రమేష్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఏఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు మండల కేంద్రంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులు అర్పించారు. అనంతరం ఏఎస్సై రమేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకుంటూ దానికి గుర్తుగా ప్రతి ఏడాది అక్టోబర్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించుకుంటామని తెలిపారు. అమరులైన పోలీసుల సేవల్ని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అర్జున్, మదన్, భరత్, యోగేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.



భీంపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



సిరికొండలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కానిస్టేబుళ్లు

వచ్చేనెల ఒకటిన శిక్షణ అధికారుల రాక

నేరడిగొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల ఒకటవ తేదీన మండలానికి ట్రైనీ అధికారులు రానున్నారని ఎంపీడీఓ శేఖర్ అన్నారు. మండలం కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ నవంబరు ఒకటవ తేదీన డాక్టర్ ఎంసీఆర్ తెలంగాణ రాష్ట్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా సర్వీస్ ద్వారా నియమించబడిన సీసీఎస్ ట్రైనీ అధికారులు మండలంలోని కుమారి గ్రామానికి రానున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ తమ నివేదికలతో విధిగా పాల్గొనాలన్నారు. నాల్గు రోజుల పాటు వివిధ అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకుంటారన్నారు. ఈసమావేశంలో వైద్యాధికారి డాక్టర్ సద్దాం, సబ్ యూనిట్ ఆఫీసర్ పవార్ రవీందర్ ఎల్త్ అసిస్టెంట్ సంతోష్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ మంజుల, ఏపీఎం లీలారాణి, పీఆర్‌ఏఈ దినేష్, విద్యుత్ ఏఏఈ నాగేంద్ర ప్రసాద్ రావు, ఏపీఓ వసంత్ రావు, సిబ్బంది పల్గిన్నారు.

పండరీపూర్‌కు భక్తుల పాదయాత్ర

ఉట్నూర్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): పండరీపూర్ భక్తుల పాదయాత్ర మండలంలోని లక్కారం హనుమాన్ మందిరం నుంచి మంగళవారం ప్రారంభమైంది. కార్తీక మాసం పూజలు పురస్కరించుకొని గత మూడు రోజుల క్రితం కొమురంభీం ఆసిఫాబాద్‌జిల్లాలోని కేరమేరి మండల కేంద్రం నుంచి మహారాష్ట్రలోని పండరీపూర్‌లో ఉన్న విట్టల్ రుక్మాబాయి ఆలయానికి చేరుకోనున్న భక్తుల బృందం ఆడే తుకారం మహారాజ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన పాదయాత్ర సోమవారం రాత్రి లక్కారం చేరుకుంది. తిరిగి మంగళవారం ఉదయం ప్రారంభమైన పాదయాత్రలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్,రాష్ట్ర మహిళా మోర్చా నాయకులు జాదవ్ సుమన్ బాయి, మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్, మర్సుకొల సరస్వతి, కొండేరి రమేష్ ,రవి జాదవ్, రాథోడ్ శేష రావులు పల్లకీ సేవలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ నివాసంలో పండరిపూర్ భక్తులకు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం తిరిగి పాదయాత్ర రాత్రికి ఇంద్రవెల్లి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు పాదయాత్ర ద్వారా జిల్లా కేంద్రానికి చేరుకున్న 31న పండరీపూర్ ప్రత్యేక రైలు ద్వారా పండరీపూర్ బయలుదేరుతారని తెలిపారు.



పండరీపూర్ పాదయాత్రలో పల్లకీ సేవలో పాల్గొన్న బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి: చైర్మన్ నర్సయ్య

నేరడిగొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల ప్రభుత్వ శాఖ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య హామీ ఇచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో గల శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయంలోని పాఠకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించేందుకు మంత్రి దృషికి తీసుకువెళతానని, పాఠకులకు కావాల్సిన సౌకర్యాలతో పాటు పక్కా భవనం ఏర్పాటయ్యేలా కృషి చేస్తానన్నారు. బోథ్ ఏఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొడ్డు గంగారెడ్డి, ఆడే వసంత్ రావ్, గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రావ్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య

జోరుగా పశువుల అక్రమ రవాణా


- సోనాల మండలం మీదుగా కొనసాగుతున్న పశువులు రవాణా
- 44వ జాతీయ రహదారిపై కంటైనర్‌లలో తరలిస్తున్న వైనం
- దృష్టి సారిస్తాం : బోథ్ సీఐ



6

ఉట్నూర్‌లో ఘనంగా దీపోత్సవం

- కార్తీకమాసం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో సుదర్శన హోమం
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళలు... హాజరైన ప్రముఖులు



6

మెదడు పోటు.. మహా చేటు

- జీవన శైలి మార్పుతోనే బ్రెయిన్ స్ట్రోక్‌కు చెక్.
- మానసిక ఒత్తిడి నియంత్రణనే అత్యంత కీలకం
- క్రమం తప్పని వ్యాయామం ప్రధానం
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే



7